సాక్షి అనకాపల్లి
సోమవారం । 23 । అక్టోబర్ । 2023



ఏఎంసీ వందేళ్ల వేడుకలు

విశాఖ : ఆంధ్ర మెడికల్ కళాశాల ఏర్పడి వందేళ్లయిన సందర్భంగా ఈనెల 27, 28, 29 తేదీల్లో వేడుకలు నిర్వహిస్తున్నారు.



బొర్రా గుహలు కిటకిట

అనంతగిరి: బొర్రా గుహలకు పర్యాటకులు పోటెత్తారు. ఆదివారం ఏడు వేల మంది తిలకించగా, రూ.6.3 లక్షల ఆదాయం వచ్చింది.



శాకంబరిగా కనకమహాలక్ష్మి

విశాఖపట్నం : కనకమహాలక్ష్మి అమ్మవారిని శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కూరగాయలతో శాకంబరిగా అలంకరించారు.

న్యూస్‌రీల్

దసరా శుభాకాంక్షలు



డిప్యూటీ సీఎం బూడి

దేవరాపల్లి: చెడుపై మంచి, దుష్ట శక్తులపై దైవ శక్తుల విజయానికి ప్రతీకగా జరుపుకునే విజయదశమిని పురస్కరించుకొని దుర్గాదేవి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలంతా ఆరోగ్యంగా ఉండాలని ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ఆకాంక్షించారు. తారువలోని క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడారు. ఆ జగన్మాత అనుగ్రహంతో ప్రజలంతా సుఖశాంతులు, సిరి సంపదలతో తులతూగాలని, రాష్ట్రంలోని ప్రతీ కుటుంబానికి విజయాలు సిద్ధించాలని ఆకాంక్షించారు. అమ్మగన్నమ్మ, ముగ్గురమ్మల మూలపుటమ్మ ఆశీస్సులతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో దూసుకుపోవాలని ఆయన ఆకాంక్షించారు.

ఎస్‌ఐల బదిలీ

సాక్షి, అనకాపల్లి: జిల్లాలో పలు పోలీస్ స్టేషన్లలో పనిచేస్తున్న 8 మంది ఎస్‌ఐలను బదిలీ చేశారు. ఈ మేరకు ఎస్పీ మురళీకృష్ణ ఉత్తర్వులు జారీ చేశారు. సబ్బవరం ఎస్‌ఐగా పనిచేస్తున్న ఎల్.సురేష్‌ను రోలుగుంట పోలీస్ స్టేషన్ ఎస్‌ఐగా, అక్కడ పనిచేస్తున్న బి.నాగ కార్తీక్‌ను డీసీఆర్బీకి, పోలీస్ కంట్రోల్ రూంలో పనిచేసే లక్ష్మణరావును కొత్తకోట పోలీస్ స్టేషన్‌కు, అక్కడ పనిచేస్తున్న ఎ.విభీషణరావును నక్కపల్లి పోలీస్ స్టేషన్కు బదిలీ చేశారు. నక్కపల్లి ఎస్‌ఐ జి.శిరీషను పోలీస్ కంట్రోల్ రూంకి, డీటీసీగా పనిచేస్తున్న సుధాకరరావును నర్సీపట్నం టౌన్ ఎస్‌ఐగా, అక్కడ పనిచేస్తున్న జి.ధనుంజయనాయుడును నర్సీపట్నం రూరల్ పోలీస్ స్టేషన్‌కు, నర్సీపట్నం రూరల్ ఎస్‌ఐను నాతవరం ఎస్‌ఐగా బదిలీ చేశారు.

నేడు 'స్పందన'కు సెలవు

తుమ్మపాల: విజయదశమి ప్రభుత్వ సెలవు దినం కావడంతో ప్రతి సోమవారం కలెక్టరేట్ కార్యాలయంలో జరిగే స్పందన ఈ వారం ఉండదని డీఆర్వో బి.దయానిధి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు పై విషయాన్ని గమనించాలన్నారు.

డిప్యూటీ కలెక్టర్ల బదిలీ

మహారాణిపేట (విశాఖ): పలువురు డిప్యూటీ కలెక్టర్లను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె.ఎస్.జవహర్‌రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. తోటపల్లి బ్యారేజ్ ప్రాజెక్టు యూనిట్-2 ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ కె.పద్మలతను విశాఖలో జాతీయ రహదారి (ఎన్‌హెచ్-16) ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌గా నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్.వెంకటేశ్వర్లును అనకాపల్లి జిల్లా కేఆర్ఆర్‌సీ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ చేశారు. పలాస ఆర్డీవో టి.సీతారామ్మూర్తిని విశాఖ భూసేకరణ అధికారి(ఎల్ఏ)గా నియమించారు. ఇక్కడ పనిచేస్తున్న డిప్యూటీ కలెక్టర్ ఎస్.జ్యోతి మాధవిని కాకినాడ జిల్లా మైనార్టీ వెల్ఫేర్ ఆఫీసర్‌గా బదిలీ చేశారు. పరిశ్రమ శాఖలో పనిచేస్తున్న డిప్యూటీ కలెక్టర్ టీఈఎం రాజును ఏపీఐఐసీ (భూసేకరణ అధికారి)గా నియమించారు. నక్కపల్లి ఎస్ఏవోబీ ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేస్తున్న కె.జ్ఞానవేణిని శ్రీకాకుళం జిల్లా ఫారెస్ట్ సెటిల్‌మెంట్ అధికారిగా బదిలీ చేశారు. డిప్యూటీ కలెక్టర్ కె.భవానీని ఏఎస్సార్ జిల్లా డీఆర్వోగా నియమించారు.

జాతీయ స్థాయి యోగా పోటీలకు విద్యార్థుల ఎంపిక



యోగా పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పాయకరావుపేట: ఈ నెల 20, 21 తేదీల్లో తమిళనాడు రాష్ట్రంలో విల్వాకులం అక్షర పబ్లిక్ స్కూల్‌లో జరిగిన సీబీఎస్‌ఈ సౌత్ జోన్ -1 యోగా పోటీల్లో శ్రీ ప్రకాష్ విద్యానికేతన్ విద్యార్థులు రాణించారు. బి.దేవాన్ష్ నాయుడు, జి.సోమసూర్యచరణ్, రక్షిత్, నవనీత్ బృందం ద్వితీయ స్థానం సాధించిందని, అండర్-14 బాలుర వ్యక్తిగత విభాగంలో జి.సోమసూర్యచరణ్ నాలుగో స్థానం సాధించాడని, వీరంతా డిసెంబర్‌లో జరగనున్న సీబీఎస్‌ఈ జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికయ్యారని విద్యా సంస్థల సీనియర్ ప్రిన్సిపాల్ ఎం.వి.వి.ఎస్.మూర్తి తెలిపారు. వీరిని విద్యా సంస్థల అధినేత సిహెచ్.వి.కె.నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సిహెచ్.విజయ్ ప్రకాష్, వైస్ ప్రిన్సిపాల్ అపర్ణ, నీలాదేవి, యోగా గురువులు సురేష్, జయంతి తదితరులు అభినందించారు.

డిసెంబర్ 9న ఏయూ పూర్వవిద్యార్థుల సమావేశం

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం పూర్వవిద్యార్థుల సమావేశం డిసెంబర్ 9వ తేదీన జరగనుంది. బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ సెంటర్ వేదికగా జరగనున్న వేవ్స్ 2023కి ముఖ్య అతిథిగా టాటా సన్స్ చైర్మన్ నటరాజన్ చంద్రశేఖర్ హాజరుకానున్నారు. విదేశాలలో స్థిరపడిన పూర్వవిద్యార్థులు వచ్చేందుకు వీలుగా ముందుగా ఆహ్వానాలు పంపుతున్నారు.

అమ్మవు నీవే అఖిల జగాలకు..



అనకాపల్లి సత్యనారాయణపురంలో కొలువుదీరిన కనకదుర్గమ్మ

దసరా అంటే శక్తి స్వరూపిణిగా అమ్మ కరుణించే పర్వదినం.. దసరా అంటే కార్యసిద్ధి కోసం కృషి చేసే వారికి విజయాన్ని అందించే పండగ.. దసరా అంటే సరదాలతో సాగిపోయే వేడుక.. భక్తులు నవరాత్రులు తొమ్మిది రూపాల్లో ఉన్న అమ్మవారిని ఆరాధిస్తారు. పదో రోజు మహిషాసురమర్దనిగా దుర్గామాతను పూజిస్తారు. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా విజయదశమిని నిర్వహిస్తారు. అమ్మవారి ఆలయాల్లో, ఇళ్లలోనూ ఆయుధపూజ నిర్వహిస్తారు. దసరా రోజున శమీ పూజతో లక్ష్మీదేవి ప్రసన్నమవుతుందని భక్తుల నమ్మకం. జిల్లా అంతటా విజయదశమి పండగను వైభవంగా నిర్వహిస్తున్నారు. ఉత్తర భారతీయులున్న చోట, అనకాపల్లి పట్టణంలోని లక్ష్మీదేవిపేటలో దాండియా నృత్యాలు చేస్తారు. వస్త్రాలు, మోటారు వాహనాలు, ఎలక్ట్రానిక్ వస్తువుల కొనుగోళ్లతో మార్కెట్ కళకళలాడింది. పొట్టేళ్లు, నాటుకోళ్ల కోసం బుచ్చెయ్యపేట మండలం వడ్డాది సంతలో ఆదివారం రద్దీ నెలకొంది. పండక్కి వచ్చే అల్లుళ్లు, బంధువులతో ప్రతి ఇల్లూ సందడిగా కనిపిస్తోంది. దసరా సంస్కృతిలో భాగమైన బొమ్మల కొలువులు పలుచోట్ల కొలువుదీరాయి. పండగకు ప్రత్యేక శోభను చేకూర్చాయి. – అనకాపల్లి రూరల్



దుర్గాదేవి అవతారంలో అనకాపల్లి సతకంపట్టు కనకదుర్గమ్మ




అనకాపల్లి నూకాంబిక అమ్మవారి బాలాలయంలోకి కలశాలను తీసుకువస్తున్న మంత్రి అమర్‌నాథ్ సతీమణి హిమగౌరి, ఆలయ చైర్మన్ మురళీకృష్ణ, ఈవో ప్రసాద్




కె.కోటపాడు మండలం గుల్లేపల్లి గ్రామంలో కంచుగుర్రాలతో ఘటాల ఊరేగింపు నిర్వహిస్తున్న భవానీమాలధారులు

సుజలాం.. సుఫలాం..



పెద్దేరు రిజర్వాయర్ నుంచి నీటి ప్రవాహం



రైవాడ జలాశయం



నిండుకుండలా తారకరామ రిజర్వాయర్

- జిల్లాలో వేలాది ఎకరాలకు సాగునీరందిస్తున్న రిజర్వాయర్లు
- వాటి అభివృద్ధి, మరమ్మతులకు రూ.13.42 కోట్లు మంజూరు

మాడుగుల: జిల్లాలో జలాశయాలే వ్యవసాయానికి ప్రధాన ఆధారం. తొమ్మిది రిజర్వాయర్లు జిల్లాలో సుమారు 91 వేల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నాయి. జలాశయాలను మరింత అభివృద్ధి చేస్తే అదనంగా మరో 30 వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని రైతులు అభిప్రాయపడుతున్నారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి 2006లో పెద్దేరు జలాశయాన్ని జాతికి అంకితం చేశారు. మరెన్నో రిజర్వాయర్లను అభివృద్ధి చేశారు. ఆయన తనయుడు జగన్‌మోహన్‌రెడ్డి ఆధునికీకరణపై దృష్టి సారించడంతో ఇకపై వ్యవసాయానికి ఢోకా ఉండదని రైతులు ధీమా వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో వివిధ జలాశయాల్లో అభివృద్ధి పనులు, మరమ్మతులకు ఇటీవల రూ.13.42 కోట్లు మంజూరయ్యాయి. మాడుగుల మండలంలో చిన్న సాగునీటి ప్రాజెక్టులు పాలగెడ్డ, ఉరకగెడ్డ, గౌరిగెడ్డల మరమ్మతులకు కూడా ప్రతిపాదనలు తయారు చేయాలని డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు అధికారులను ఆదేశించారు.

మంజూరైన నిధుల వివరాలు..

- జిల్లాలో 32 వేల ఎకరాలకు సాగునీరందించే భారీ నీటిపారుదల ప్రాజెక్టు తాండవ జలాశయం మెయింటెనెన్స్ పనులకు రూ.2.65 కోట్లు మంజూరయ్యాయి.
- రావికమతం మండలం కళ్యాణపులోవ (వరాహ) ప్రాజెక్టు పంట కాలువలపై అక్విడెక్ట్‌కు రూ.10 లక్షలు కేటాయించారు.
- దేవరాపల్లి మండలం రైవాడ జలాశయం ప్రధాన గేట్ల మరమ్మతులకు రూ.90 లక్షలు మంజూరు చేశారు.
- పెద్దేరు జలాశయం ఫోర్ ఏఎల్ చానల్ నుంచి అదనంగా 1800 ఎకరాలకు సాగునీరందించడానికి తాజాగా రూ.9.12 కోట్లు విడుదలయ్యాయి.
- కోనాం జలాశయం ప్రధాన గేట్ల మరమ్మతులకు రూ.10 లక్షలు మంజూరయ్యాయి.
- తారకరామ జలాశయం ప్రధాన గేట్ల మరమ్మతులకు రూ.15 లక్షలు విడుదలయ్యాయి.
- బుచ్చెయ్యపేట మండలం మంగళాపురం ఆనకట్ట నిర్మాణానికి రూ.40 లక్షలు మంజూరు చేశారు. ఇది పూర్తయితే 200 ఎకరాలకు సాగునీరు అందుతుందని రైతులు చెబుతున్నారు.

వ్యవసాయమే ప్రధాన ఆధారం



మాడుగుల నియోజకవర్గంలో ఎటువంటి కంపెనీలు లేవు. దీంతో ఇక్కడ వ్యవసాయమే ప్రధాన జీవనాధారం. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఆర్బీకేలు, రైతు భరోసా సాయంతో వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తున్నారు. దీనికి తోడు జలాశయాల ఆధునికీకరణ, ప్రధాన గేట్ల మరమ్మతు పనులకు నిధులు మంజూరు చేస్తున్నారు.

– పాలిమేర చిన్నారావు, రైతు మాడుగుల

మెట్ట భూములను సాగులోకి తెస్తాం



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వ్యవసాయానికి పెద్దపీట వేస్తున్నారు. ఆర్బీకేలు, అగ్రి ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. సాగునీటి ప్రాజెక్టులు బాగు చేయడంపై దృష్టి సారించారు. దీనిలో భాగంగానే జలాశయాల ఆధునికీకరణకు నిధులు మంజూరు చేస్తున్నారు. రానున్న కాలంలో మాడుగుల నియోజకవర్గంలో ప్రతి జలాశయాన్ని అభివృద్ధి చేసి మెట్ట భూములన్నింటినీ సాగులోకి తీసుకురావడానికి కృషి చేస్తున్నాము.

– బూడి ముత్యాలనాయుడు, డిప్యూటీ సీఎం

ఖరీఫ్ పంట కాలం పూర్తయితే పనులు చేపడతాం

ప్రస్తుతం ఖరీఫ్ వరి చేలు పంట దశలో ఉన్నాయి. పంట కాలం పూర్తయిన వెంటనే జలాశయాల ప్రధాన గేట్ల మరమ్మతులు, ఆధునికీకరణ పనులు, మెయింటెనెన్స్ పనులు ప్రారంభిస్తాము. జిల్లాలో జలాశయాల్లో సాగునీటి వనరులు పుష్కలంగా ఉన్నాయి. ఖరీఫ్ పంటలకు ఢోకా లేదు.

– ఎ.త్రినాథం, జిల్లా వాటర్ రిసోర్స్ ఆఫీసర్

అప్పన్న జమ్మివేట ఉత్సవం

- పూలతోట ముస్తాబు
- ఉత్సవంలో రామాలంకారంలో దర్శనమివ్వనున్న అప్పన్న
- రేపు సాయంత్రం 6 గంటల వరకే దర్శనాలు



వరదరాజస్వామి అలంకారంలో అప్పన్న



స్వామి కొలువుదీరే ప్రధాన మండపం

సింహాచలం: విజయదశమి పురస్కరించుకుని మంగళవారం సింహాచల శ్రీ వరాహ లక్ష్మీ నృసింహ స్వామి జమ్మివేట ఉత్సవం జరగనుంది. కొండదిగువ పూలతోటలో ఈ ఉత్సవాన్ని వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ అధికారులు విశేష ఏర్పాట్లు చేశారు. పూలతోటను ముస్తాబు చేస్తున్నారు. పెద్ద ఎత్తున విద్యుద్దీపాలంకరణ, ప్రధాన మండపానికి, శ్రీకృష్ణ కొలను, రాతి ఫౌంటైన్లను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. సింహగిరి మెట్లమార్గం, పూలతోట, స్వామి తిరువీధి జరిగే అడవివరం పురవీధుల్లో పారిశుధ్య పనులు నిర్వహిస్తున్నారు. గోపాలపట్నం పోలీసులు భద్రత ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

ఉత్సవం ఇలా..

వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామికి రామాలంకారం చేసి మంగళవారం నాలుగు గంటల సమయంలో సింహగిరి నుంచి మెట్లమార్గంలో పల్లకీలో కొండదిగువకి తీసుకొస్తారు. కొండదిగువ ఉన్న పూలతోటలోని ప్రధాన మండపంలో స్వామిని అధిష్ఠింపజేస్తారు. సాయంత్రం 6 గంటల నుంచి పూజలు ప్రారంభిస్తారు. తొలుత పూలతోటలోని శమీవృక్షం వద్ద శమీపూజ నిర్వహిస్తారు. అనంతరం ఆ శమీ దళాలను స్వామి చెంతన ఉంచి పూజలు చేపడతారు. జమ్మివేట ఉత్సవం నిర్వహించి.. తదుపరి స్వామిని పుష్కరిణి మండపం వద్దకు తీసుకొస్తారు. అక్కడ అశ్వవాహనంపై అధిష్ఠిస్తారు. రాత్రి అడవివరంలో స్వామికి అశ్వవాహనంపై తిరువీధి నిర్వహిస్తారు. ఈ ఉత్సవాన్ని పురస్కరించుకుని సింహగిరిపై మంగళవారం సాయంత్రం 6 గంటల వరకే స్వామి దర్శనాలు లభిస్తాయి.

విశాఖ పరిపాలన కేంద్రంగా వర్ధిల్లాలి

సింథియా: విశాఖ పరిపాలన కేంద్రంగా వర్ధిల్లాలని, సుపరిపాలన ఫలితాలతో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందాలని వికేంద్రీకరణ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ ప్రొఫెసర్ హనుమంతు లజపతిరాయ్ అన్నారు. వికేంద్రీకరణ జాయింట్ యాక్షన్ కమిటీతో సింథియాలోని గురుద్వారా నానక్ దర్బార్‌లో ఆదివారం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. సిక్కు మతస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్న ఈ కార్యక్రమంలో లజపతిరాయ్ మాట్లాడారు. వెనుకబడిన ప్రాంతాలకు పరిపాలన కేంద్రం దగ్గరగా ఉంటే.. ఆయా ప్రాంతాల సమస్యలను త్వరితగతిన పరిష్కరించడానికి అవకాశముంటుందన్నారు. రాష్ట్రంలో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని గురుద్వారా కమిటీ ప్రత్యేక ప్రార్థనలు చేసింది. 66వ వార్డు కార్పొరేటర్ మహ్మద్ ఇమ్రాన్, గురుద్వారా కమిటీ అధ్యక్షుడు హరచరణజిత్‌సింగ్, బలవేంద్రసింగ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రతిభకు పురస్కారం



ఉపకార వేతనాలు తీసుకున్న విద్యార్థులతో ఎంపీ సత్యవతి, సంఘం సభ్యులు

300మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు

అనకాపల్లి టౌన్: విద్యార్థి దశ నుంచే ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, ప్రభుత్వం విద్య వైద్యానికి ఎంతో ప్రాధాన్యం ఇస్తోందని ఎంపీ బి.వి.సత్యవతి అన్నారు. గవరపాలెం కొణతాల సుబ్రహ్మణ్యం కల్యాణమండపంలో గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో గత ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఆదివారం ఉపకార వేతనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. గత ఏడాది ఉత్తమ ఫలితాలు సాధించిన 300మంది విద్యార్థులకు రూ.10 లక్షలు అందజేయడం జరిగిందన్నారు. పదో తరగతి నుంచి పీజీ, ఇంజనీరింగ్ కోర్సుల విద్యార్థులకు ఉపకార వేతనాలు అందజేసినట్లు ఆమె చెప్పారు. వైఎస్సార్‌సీపీ జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి, ముఖ్య అతిథులు డాక్టర్ కేవీపీ సుబ్రహ్మణ్యం, వేగి రామునాయుడు, ఐఆర్ఏఎస్ ప్రాజెక్టు మేనేజర్ మళ్ల సాంబశివరావు, గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు బొడ్డేడ సన్యాసినాయుడు, కార్యదర్శి బుద్ధ రమణాజీ, కోశాధికారి కర్రి శివసూర్యనారాయణ, విద్యార్థులు వారి తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

నేడు జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పోటీలు

మాడుగుల రూరల్: లలితాదేవి శరన్నవ రాత్రోత్సవాల్లో భాగంగా చీడికాడ మండలం అప్పలరాజుపురంలో సోమవారం మధ్యాహ్నం జిల్లా స్థాయి ఎడ్లబళ్ల పరుగు పోటీలు నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ చుక్కా అప్పలనాయుడు, ఆలయ కమిటీ సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులుగా రూ.10 వేలు, రూ.8 వేలు, రూ.6 వేలు, తర్వాత స్థానాల్లో నిలిచిన బళ్లకు రూ.4 వేలు, రూ.3 వేలు, రూ.2 వేలు, రూ.1000 అందిస్తామన్నారు. నామినేషన్ ఫీజు జతకు రూ.200 చెల్లించి పేరు నమోదు చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా ఆలయం వద్ద అన్నసమారాధన, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.

ఘనంగా శూలాల మహోత్సవం



శూలాలు ధరించి పూజలో పాల్గొన్న భక్తులు

అచ్యుతాపురం మండలం ఎం.జగన్నాథపురంలో ఆదివారం రాత్రి శూలాల మహోత్సవం ఘనంగా నిర్వహించారు. దసరా వేడుకల్లో భాగంగా భవానీ మాల ధరించిన భక్తులు శూలాలు వేసుకుని ఉత్సవంలో పాల్గొన్నారు. వెరసి గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది.

– అచ్యుతాపురం (అనకాపల్లి)



శూలాల మహోత్సవంలో అమ్మవారికి పూజలు

పొట్టేళ్లు, నాటుకోళ్లకు భలే గిరాకీ



పొట్టేళ్ల కొనుగోళ్లతో సందడిగా వడ్డాది సంత

వడ్డాది సంతకు పండగ శోభ

బుచ్చెయ్యపేట: వడ్డాది సంతకు పండగ కళ వచ్చింది. ఏటా దసరా పండగ నాడు అమ్మవారికి మొక్కులు చెల్లించడానికి నాటుకోళ్లు, గొర్రె, మేకపోతుల కొనుగోళ్లు చేస్తుంటారు. వీటి కోసం ఇక్కడ ఆదివారం సంతకు ఉమ్మడి జిల్లాతోపాటు తూర్పు గోదావరి, విజయనగరం జిల్లాల నుంచి పెద్ద ఎత్తున కొనుగోలుదారులు తరలి వచ్చారు. దాంతో పొట్టేళ్లు, నాటుకోళ్లకు భారీ గిరాకీ ఏర్పడింది. ఒక్కో పొట్టేలు రూ.10 వేల నుంచి రూ.25 వేల వరకు ధర పలికాయి. నాటుకోళ్లు రూ.700 నుంచి రూ.4 వేల వరకు అమ్ముడుపోయాయి. ఉమ్మడి జిల్లాలోనే అతిపెద్ద సంతగా వడ్డాది ప్రసిద్ధి చెందడంతోపాటు పండగ ముందు సంత రావడంతో గతంలో ఎన్నడూ లేని విధంగా రద్దీ నెలకొంది. గాజువాక, అనకాపల్లి, పరవాడ, విశాఖ, పాడేరు, నర్సీపట్నం, తుని తదితర ప్రాంతాలకు చెందిన వారు పొట్టేళ్లు, నాటుకోళ్లను భారీగా కొనుగోలు చేసి వాహనాల్లో తరలించారు. సోమ, మంగళవారం రోజుల్లో దుర్గాదేవికి మొక్కులు చెల్లించడానికి వీటిని కొనుగోలు చేశారు. వీటితోపాటు ఇతర వంట సామగ్రి, తదితర చిల్లర వస్తువులు భారీగా క్రయవిక్రయాలు జరిగాయి.



వడ్డాది సంతలో నాటుకోళ్ల కొనుగోలు

కశింకోటలో 26 నుంచి ఉరుసు షరీఫ్

కశింకోట: కశింకోటలో సయ్యద్ అబ్దుల్ అజీజ్ షా ఖాదరీబాబా దర్గా ఉరుసు షరీఫ్ (చందనోత్సవం) ఈ నెల 26 నుంచి మూడు రోజులపాటు జరగనుందని జిల్లా మైనారిటీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ అబ్దుల్ హక్ ఆదివారం తెలిపారు. మొదటి రోజు గార్వీ షరీఫ్ ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు జరుగుతుందన్నారు. దీనిలో భాగంగా ఖురాన్ పఠనం, రాత్రి 11 గంటలకు మిలాద్ షరీఫ్ జరుగుతాయన్నారు. 27న ప్రధానమైన ఉరుసు షరీఫ్ జరగనుందని, చందనాన్ని గుర్రంపై గ్రామ ప్రధాన వీధుల్లో ఊరేగిస్తామన్నారు. అదే రోజు రాత్రి 7 గంటలకు ఫాతిహా(ఆరాధన), 9 గంటలకు కవ్వాలి ఉర్దూ పాటల పోటీ ఉంటాయన్నారు. 28న సాయంత్రం 6 గంటలకు చిరాగి(దీపారాధన)తో ఉత్సవం ముగుస్తుందన్నారు.

1,200 లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం

దేవరాపల్లి: మండలంలోని కలిగొట్ల గ్రామ శివారులో గుట్టు చప్పుడు కాకుండా నిర్వహిస్తున్న సారా తయారీ స్థావరాలపై పోలీసులు ఆదివారం మెరుపు దాడులు నిర్వహించారు. ఎస్‌ఐ డి. నాగేంద్ర, తన సిబ్బందితో కలిసి వాటిని ధ్వంసం చేశారు. డ్రమ్‌లలో సారా తయారీకి నిల్వ చేసిన 1,200 లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశారు. దీని తయారీకి ఉపయోగించిన ప్లాస్టిక్ డ్రమ్‌లు, సిల్వర్ పాత్రలు తదితర సామగ్రిని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.



సారా తయారీలో వినియోగించిన సామగ్రితో ఎస్‌ఐ నాగేంద్ర

జిల్లా వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా బాబురెడ్డి

అనకాపల్లి టౌన్: జిల్లా వెయిట్‌లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎస్‌వీపీ బాబురెడ్డి ఎన్నికయ్యారు. స్థానిక వేల్పుల వీధి సీతారామ కల్యాణ మండపంలో శనివారం రాత్రి జరిగిన ఎన్నికల్లో అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా గుమ్మాల వెంకటరాము (ఈస్టు కోస్టు రైల్వే విశాఖ క్లర్క్), కోశాధికారిగా గొన్నాబత్తుల చంద్రశేఖర్, ఉపాధ్యక్షులుగా ఉగ్గిన అప్పారావు, ఎం.సురేష్, సహాయ కార్యదర్శులుగా కోరుకొండ రమేష్, సీహెచ్.మణికంఠ, సంజయ్, సభ్యులుగా ఇంజరపు సురేష్‌కుమార్, ఆడారి పూర్ణచంద్రరావు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మాల వెంకటరాము మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కొత్త జిల్లాలు ఏర్పడిన తర్వాత అనకాపల్లి జిల్లాలో వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ కమిటీని ఏర్పాటు చేసిందన్నారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించిన జిల్లా క్రీడాకారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వోద్యోగాల్లో స్థిరపడే విధంగా శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. తాను గతంలో వెయిట్ లిఫ్టింగ్ ద్వారా జాతీయస్థాయి పతకాలు సాధించి తద్వారా రైల్వేలో ఉద్యోగం సాధించినట్లు పేర్కొన్నారు. ఎన్నికల పర్యవేక్షకులుగా ఇండియన్ వెయిట్ లిఫ్టింగ్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు బడేటి వెంకట్రామయ్య, ఇండియన్ వెయిట్ లిఫ్టింగ్ ఒలింపిక్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, విశాఖ ఉమ్మడి జిల్లా కార్యదర్శి కె.సూర్యనారాయణ వ్యవహరించారు. అనంతరం జిల్లా ప్రధాన కార్యదర్శి రామును కమిటీ సభ్యులు శాలువాలతో సత్కరించారు. జిల్లాలో వివిధ అసోసియేషన్ల అధ్యక్ష, కార్యదర్శులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



జిల్లా ప్రధాన కార్యదర్శి గుమ్మాల వెంకటరామును సత్కరిస్తున్న కమిటీ సభ్యులు

యువకుడి అనుమానాస్పద మృతి



మృతుడు సాయి(ఫైల్)

మాకవరపాలెం: అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన ఘటనపై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ రామకృష్ణారావు ఆదివానం తెలిపారు. మండలంలోని తామరం గ్రామానికి చెందిన పెదపల్లి సాయి(23) శనివారం రాత్రి స్నేహితులతో కలిసి పార్టీకి వెళ్లాడు. అతడు తిరిగి వచ్చి ఇంటి సమీపంలో రోడ్డు పక్కనే గాయాలతో పడి ఉండటాన్ని స్థానికులు గుర్తించి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. దీంతో వెంటనే నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించగా, వైద్యులు పరిశీలించి మరణించినట్టు ధ్రువీకరించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు. యువకుడి మృతికి ఏదైనా ప్రమాదమా లేక ఇతర కారణాలు ఏమైనా ఉన్నయా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు. పార్టీకి వెళ్లిన స్నేహితులను విచారణ చేస్తున్నట్టు వివరించారు.

ఏదీ ఆనాటి దసరా వైభవం?

- కనుమరుగైన గుర్రాల సంత
- జాడలేని కర్ర, కత్తిసాము పోటీలు
- నేడు మాడుగులలో దసరా ఉత్సవాలు



రెండేళ్ల క్రితం మాడుగుల గుర్రాల సంతకు వచ్చిన గుర్రాలు (ఫైల్)

మాడుగుల: ఆనాటి రాజుల చరిత్రకు సాక్షీభూతంగా నిలుస్తున్న మాడుగులలో దసరా వైభవం కానరాలేదు. ఒకనాటి జయపూర్ సంస్థానంలో ఉన్న ఈ ప్రాంతంలో దసరా ఉత్సవాలు వచ్చాయంటే ఆ సందడే వేరు.. రాజులు యుద్ధాల్లో వాడే ఆయుధాలతో జమ్మి చెట్టును నరికి దేవీతల్లి ఆలయంలో పూజలు, ఉత్సవాలు ఘనంగా నిర్వహించేవారు. ఇలా చేయడం వల్ల విజయం సిద్ధిస్తుందని అప్పటి సైనికుల ప్రగాఢ నమ్మకం. వీరికి కర్ర, కత్తిసాము పోటీలను ఇక్కడ కోట బయట నిర్వహించేవారు. ఈ పోటీలు తిలకించడానికి రాష్ట్రవ్యాప్తంగా ప్రజానీకం తరలివచ్చేవారు. వీటి తర్ఫీదుకు మాడుగులలో ఐదు సావిడులు ఉండేవి. రాన్రానూ రాజుల పాలన అంతరించడంతో అవి కనుమరుగయ్యాయి.

కానరాని సాంస్కృతిక ప్రదర్శనలు

ఆ రోజుల్లో ప్రధానంగా తోలుబొమ్మలాట ప్రత్యేక ఆకర్షణగా నిలిచేది. దీంతోపాటు ఇక్కడ దసరా వేదికపై సత్యహరిశ్చంద్ర, మాయాబజార్, బాలనాగమ్మ, కృష్ణార్జున యుద్ధం వంటి పౌరాణిక నాటకాలు ప్రదర్శించారు. బుర్రకథ, హరికథలు, బళ్లవేషాలు, నేల వేషాలు, శక్తి వేషాలు వంటి సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించేవారు. చుట్టుపక్కల గ్రామాలతోపాటు దూర ప్రాంతాల నుంచి ఎంతో మంది ఆహూతులు విచ్చేసి వీటిని ఆనందంగా వీక్షించేవారంట. రాన్రానూ వీటికి ఆదరణ తగ్గి రికార్డింగ్ డ్యాన్స్ వంటివి నిర్వహిస్తున్నారు.

అంతరించిపోయిన గుర్రాల సంత

దసరా రోజు రాజుల వాడిన ఆయుధాలకు పూజ అనంతరం గుర్రాలు సంత మాడుగులలో జరిగేది. హంపీ, విజయనగరం తర్వాత ఇక్కడే గుర్రాలు సంత జరిగేది. యుద్ధ స్వారీకి కావ్వాడ్, సుడేధార్ రేస్ గుర్రాలు ఎక్కువగా వచ్చేవి. రాజుల కాలం తర్వాత మన్యం ప్రాంతాల్లో పంట ఉత్పత్తులు మైదాన ప్రాంతాలకు తరలించడానికి వేలాదిగా గుర్రాలు వాడేవారు. రవాణా సౌకర్యం అందుబాటులోకి రావడంతో క్రమంగా వీటి వాడకం తగ్గిపోయింది. ఈ ప్రభావంతో రెండేళ్ల వరకు అరకొరగా వచ్చిన గుర్రాలు ఈ ఏడాది ఒక్కటీ రాకపోవడంతో గుర్రాల సంత ప్రాంగణం వెలవెలబోయింది.

యూనియన్ల ఆధ్వర్యంలో ఉత్సవాలు

ఆనాటి సంప్రదాయాన్ని కొనసాగిస్తూ మోటారు యూనియన్ల ఆధ్వర్యంలో 150 ఏళ్ల నుంచి దసరా ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. ఈనాటికి కత్తి, కర్ర సాములు చేసేవారు వంశపారంపర్యంగా ఉన్నారు.

పసుపు బస్తాలు జారి పడి కూలీ దుర్మరణం



పెంటారావు మృతదేహం



దర్యాప్తు చేస్తున్న ఎస్‌ఐ ఆదినారాయణరెడ్డి

కశింకోట: మండలంలోని బయ్యవరంలో లోడ్ చేస్తున్న సమయంలో లారీ నుంచి పసుపు బస్తాలు జారి మీద పడి కూలీ దుర్మరణం చెందాడు. ఎస్‌ఐ ఎ. ఆదినారాయణ రెడ్డి ఆదివారం వెల్లడించిన వివరాల ప్రకారం.. కశింకోటలోని గాడి వీధికి చెందిన బొబ్బరి పెంటారావు(38) బయ్యవరంలోని కొణతాల కోల్డ్ స్టోరేజిలో రోజు వారీ కూలీగా పని చేస్తున్నాడు. దీనిలో భాగంగా శనివారం సాయంత్రం పొద్దుపోయిన తర్వాత లారీపై పసుపు బస్తాలు ఎక్కించగా, అదే సమయంలో లోడ్ చేసిన కొన్ని బస్తాలు అతడిపై పడ్డాయి. దీంతో ఛాతిపైన, ఇతర భాగాలపైన తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతుడికి ఇద్దరు ఆడ పిల్లలు ఉన్నారు. ఇంటి పెద్ద దిక్కు అయిన పెంటారావు మృతితో కుటుంబం విషాదంలో మునిగిపోయింది. బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు కుటుంబాన్ని పరామర్శించి సంఘటన తీరు తెలుసుకుని తమ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఉన్నత చదువులకు ఊతం.!

- ఇంటర్‌లో ఫెయిలైన వారికి మరో అవకాశం
- రెగ్యులర్ లేదా ఓపెన్ కోర్సుల్లో చేరేలా అవగాహన
- ఉమ్మడి విశాఖ జిల్లాలో 15,738 మంది ఫెయిలైన విద్యార్థులు
- కాలేజీల్లో చేరితే రెగ్యులర్ విద్యార్థులతో సమానం
- ఫీజు చెల్లింపునకు ఈ నెల 30తో ముగుస్తున్న గడువు

విశాఖ విద్య: ఇంటర్మీడియెట్ ఫెయిలైన విద్యార్థులకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. 2024 మార్చిలో జరిగే పరీక్షలకు హాజరై పాసైతే మార్కుల మెమోపై కంపార్ట్‌మెంట్ అని కాకుండా రెగ్యులర్‌గా ఉత్తీర్ణులైనట్లుగానే గుర్తింపు ఇవ్వనున్నారు. తప్పిన వాటితో పాటు అన్ని సబ్జెక్టులు రాసినా, ఎక్కువ మార్కుల వచ్చిన వాటినే పరిగణనలోకి తీసుకుంటారు.



ఇంటర్మీడియెట్‌తోనే ఆగిపోకుండా విద్యార్థులను ఉన్నత చదువుల వైపు తీసుకురావాలనే ప్రభుత్వ లక్ష్యం మేరకు ఉమ్మడి విశాఖ జిల్లా విద్యాశాఖాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో 15,738 మంది విద్యార్థులు ఇంటర్మీడియెట్ ఫెయిలైన వారు ఉన్నట్లుగా అధికారులు గుర్తించారు. వీరందరితో వార్షిక పరీక్షలకు ఫీజు కట్టించే బాధ్యతలను కాలేజీల ప్రిన్సిపాళ్లకు అప్పగించారు. ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి రాయల సత్యనారాయణ దీనిపై విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలో పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల ప్రిన్సిపాళ్లతో ప్రతి రోజూ వెబెక్స్ ద్వారా సమీక్ష చేస్తూ, నూరు శాతం లక్ష్య సాధనకు దిశా నిర్దేశం చేస్తున్నారు.

జిల్లా	కాలేజీలు	ఫెయిలైన విద్యార్థులు	ఫీజు చెల్లించిన వారు
విశాఖపట్నం	173	8,397	4,006
అనకాపల్లి	133	6,323	2,612
అల్లూరి	72	1,018	339
మొత్తం	378	15,738	6,957

ఫెయిలైనా మళ్లీ కాలేజీకి..

2021–22, 2022–23 విద్యా సంవత్సరంలో ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం తప్పిన విద్యార్థులు మళ్లీ కాలేజీల్లో చేరి, చదువుకోవచ్చు. ఇలా విశాఖలో 8,397 మంది, అనకాపల్లిలో 6,323 మంది, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1,018 మంది విద్యార్థులు ఉన్నారు. కాలేజీల్లో అడ్మిషన్ తీసుకుంటే వారిని రెగ్యులర్ విద్యార్థులుగానే పరిగణించి ×అమ్మఒడి¥ వంటి సంక్షేమ పథకాలు కూడా మంజూరు చేస్తారు. ప్రభుత్వం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా విద్యాశాఖాధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

ఈ నెల 30తో ముగియనున్న గడువు

2024 మార్చిలో జరిగే పరీక్షలకు హాజరయ్యే ఫెయిలైన విద్యార్థులు ఫీజు చెల్లించేందుకు ఈ నెల 30 వరకు గడువు ఉంది. ఉమ్మడి విశాఖ జిల్లాలో గుర్తించిన 15,738 మందిలో శుక్రవారం నాటికి 6,947 మంది ఫీజు చెల్లించారు. ఆన్‌లైన్ ద్వారా ఫీజు చెల్లించే అవకాశం ఉన్నందున నూరు శాతం లక్ష్యం సాధించేలా దసరా సెలవుల్లో విద్యార్థులకు అవసరమైన సహకారం అందించాలని కాలేజీల ప్రిన్సిపాళ్లకు ఆదేశాలు జారీ చేశారు. వీటిపై సందేహాల నివృత్తికి విశాఖపట్నంలోని ఆర్‌ఐవో కార్యాలయం ఫోన్ నంబర్ 0891–2552854కు సంప్రదించేలా తగిన ఏర్పాట్లు చేశారు.

ప్రిన్సిపాళ్లు బాధ్యత తీసుకోవాలి



ఇంటర్మీడియెట్ ఫెయిలైన విద్యార్థులను తిరిగి కాలేజీల్లో చేర్పించటం, లేదంటే పరీక్షలకు హాజరయ్యేలే ఫీజు చెల్లించడం బాధ్యతను కాలేజీల ప్రిన్సిపాళ్లకు అప్పగించాం. సచివాలయ స్థాయిలో జరిగిన డ్రాపవుట్స్ సర్వే ఆధారంగా గుర్తించిన విద్యార్థులందరితో తప్పనిసరిగా ఫీజు కట్టించుకోవాలి.

– రాయల సత్యనారాయణ, ఆర్‌ఐవో ఉమ్మడి విశాఖ జిల్లా

విద్యార్థులకు మంచి అవకాశం



ఫెయిలైన విద్యార్థులకు ఇదో చక్కటి అవకాశం. రెగ్యులర్ విద్యార్థులతో సమానంగా గుర్తింపు ఇస్తున్నందున ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని మా కాలేజీ పరిధిలోని విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నాం. అధ్యాపకులను దీనిలో భాగస్వామ్యులను చేశాం.

–పి.ఉమారాణి, సీనియర్ ప్రిన్సిపాల్, భీమునిపట్నం

క్లుప్తంగా

28న దేవస్థానం ఖాళీ స్థలం లీజుకు వేలం

అనకాపల్లిటౌన్: స్థానిక సుంకరమెట్ట జంక్షన్‌లో శ్రీ సత్యనారాయణ, సూర్యనారాయణ స్వామి దేవస్థానం ఆవరణలో ఖాళీ స్థలంపై ఏడాది పాటు హక్కు కల్పించేందుకు ఈనెల 28న వేలంపాట నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో కె.ఆదినారాయణ, చైర్మన్ కె.ఎం. నాయుడు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వేలంలో హక్కు దక్కించుకునేవారు ఖాళీ స్థలాన్ని అద్దె ప్రాతిపదికన వివాహాది శుభకార్యక్రమాలకు ఇవ్వవచ్చని పేర్కొన్నారు. వచ్చే ఏడాది జనవరి 1 నుంచి డిసెంబర్ 31వ తేదీ వరకూ(ఏడాదిపాటు) హక్కు పొందేందుకు దేవస్థానం ఆవరణలో టెండర్‌కమ్ బహిరంగ వేలంపాట నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వేలంపాటలో పాల్గొదలచిన వారు రూ.50వేలు ధరావత్తుగా చెల్లించాలని తెలిపారు. పాటదారులు రూ.2లక్షల విలువగల సాల్వెన్సీ సర్టిఫికెట్లు ఇవ్వవలసి ఉంటుందన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం రేపు

అనకాపల్లిటౌన్: మండలంలోని అక్కిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ ఆవరణలో ఈ నెల 24న ఉదయం 9గంటల నుంచి సాయంత్రం వరకూ జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో కె.నరసింహారావు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో నలుగురు వైద్య నిపుణులు రోగులకు సేవలందిస్తారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని తుమ్మపాల పీహెచ్‌సీ పరిధిలో ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

శంకరం బ్రిడ్జి వద్ద పిచ్చిమొక్కలు తొలగించాలి



శంకరం బ్రిడ్జి వద్ద పెరిగిన పిచ్చిమొక్కలు

అనకాపల్లిటౌన్: మండలంలో శంకరం బ్రిడ్జికి ఇరువైపులా ఉన్న పిచ్చిమొక్కలను తొలగించి, పెద్దపెద్దగోతులను పూడ్చాలని సిద్ధార్థా సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం ఆదివారం కోరారు. అనకాపల్లి నుంచి సబ్బవరం వెళ్లే శంకరం రహదారిలో బ్రిడ్జిపై ఇరువైపులా పిచ్చిమొక్కలు పెరిగిపోవడంతో పాటు పెద్దపెద్దగోతులు ఉండడంతో ప్రయాణీకులు ఇబ్బందులు ఎదురుంటున్నారని తెలిపారు.

ఏకాగ్రతతో చదివితే ఉజ్వల భవిష్యత్తు

మునగపాక: పోటీ పరీక్షల్లో రాణించాలంటే ఏకాగ్రత ఎంతో అవసరమని విశ్రాంత డీఈవో శిష్టా తమ్మిరాజు తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో స్పందించే హృదయం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఎన్ఎంఎంఎస్ శిక్షణ తరగతుల ముగింపులో భాగంగా నిర్వహించిన పరీక్షలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ఆదివారం బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా తమ్మిరాజు మాట్లాడుతూ విద్యార్థులు ఇష్టపడి చదవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు కె.వి.రమణ, ఆడారి దక్షిణామూర్తి, ఎం.వై.రాము, శివకోటి దుర్గా ప్రసాద్, జోగారావు పాల్గొన్నారు.

అనకాపల్లి సినిమాలు

టైగర్ నాగేశ్వరరావు	: రాజా
లియో	:సత్యనారాయణస్క్రీన్-1
చిన్నా	:సత్యనారాయణస్క్రీన్-2
భగవంత్ కేసరి	: షిర్డిసాయి
టైగర్ నాగేశ్వరరావు	: పర్తిసాయి
గణపథ్(తెలుగు)	: వెంకటేశ్వర
800	: శ్రీసత్య
భగవంత్ కేసరి	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 28 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-10 యూనిట్లు, బి పాజిటివ్-10 యూనిట్లు, ఒ పాజిటివ్-4 యూనిట్లు, ఒ నెగిటివ్-2 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి యు.లోకేష్(ఫోన్ నంబర్ 9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 229 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 194 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(ఫోన్ నంబర్ 08924223595)ని సంప్రదించవచ్చు.

మహా కనకదుర్గా.. శివానంద చరితా



కశింకోట గవరపేట మధ్య వీధిలో దుర్గాదేవి విగ్రహం వద్ద పూజలు నిర్వహిస్తున్న భవానీ భక్తులు



చింతలపాలెంలో లడ్డూ వేలం



నూతలగుంటపాలెంలో దుర్గాదేవి విగ్రహాన్ని దర్శించుకుంటున్న భవానీ భక్తులు



వెదురుపర్తిలో వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబుకు సత్కారం



కనకమహాలక్ష్మి వీధిలో అన్న సమారాధన



నూకాంబిక బాలాలయంలో కలశాలకు పూజలు చేస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్ భార్య హిమగౌరీ



నవదుర్గాదేవి అవతారంలో గౌరీదేవి



మహిషాసురమర్దని అవతారంలో కామాక్షిదేవి

అనకాపల్లిటౌన్: శరన్నవరాత్రి ఉత్సవాలను అత్యంత భక్తిశ్రద్ధలతో వైభవంగా నిర్వహిస్తున్నారు. ఎనిమిదో రోజు అష్టమి తిథి సందర్భంగా ఆదివారం ఆలయాల్లో పెద్ద ఎత్తున కుంకుమ పూజలు, హోమాలు జరిపారు. ఈ కార్యక్రమాలు భవానీ భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఉత్తరాంధ్ర ఇలవేల్పు అనకాపల్లి నూకాంబిక అమ్మవారి బాలాలయంలో రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య,ఐటీశాఖ మంత్రిగుడివాడ అమర్‌నాథ్ భార్య గుడివాడ హిమగౌరీ ఉత్సవమూర్తికి పంచామృతాలతో అభిషేకాలు, 108 కలశాలకు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాన్ని ఆలయ ఈవో బండారు ప్రసాద్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొణతాల మురళీకృష్ణ, 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య, గవర కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ బొడ్డేడ శివ,ఎన్టీఆర్ ఆస్పత్రిఅభివృద్ధి కమిటీ డైరెక్టర్ జి.రామ్మూర్తి, 83వ వార్డు ఇన్‌చార్జి జాజుల రమేష్ పాల్గొన్నారు.

దుర్గాదేవిగా సంతకంపట్టు కనకదుర్గమ్మ

స్థానిక గవరపాలెం సంతకంపట్టు కనకదుర్గమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు భోగారపు వెంకటరమణ ఆధ్వర్యంలో అమ్మవారికి కంకుమ పూజలు, హోమాలు, ప్రత్యేక అలంకరణ నిర్వహించారు. ఆలయ శాశ్వత దాతలు కాండ్రేగుల నాయుడు భాగ్యలక్ష్మి, మళ్ల జగ్గప్పారావు మోహినీదేవి దంపతులు ఆర్థిక సాయంతో ఏడువేలమంది ముత్తయిదువులకు వాయినాలను ఆలయ ఆవరణలో పంపిణీ చేశారు. మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ దంపతుల ఆర్థిక సాయంతో భవానీ మాలాధారణ భక్తులకు మధ్యాహ్నం అన్నసమారాధన జరిపారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ మూర్తిని పట్టణ వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు పి.వి.రమణ, చైర్మన్ కర్రి సన్యాసినాయుడు, ఆలయ నిర్వాహకులు కాండ్రేగుల నాయుడు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నవదుర్గాదేవిగా గౌరీదేవి

గవరపాలెం గౌరీపంచాయతన దేవాలయంలో గౌరీదేవి నవదుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధానఅర్చకులు అంపోలు గోపాలకృష్ణ శర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి నిర్వహించిన సామూహిక కుంకుమార్చనలో మహిళా భక్తులు పాల్గొన్నారు.ఆలయ మండపంలో రథోత్సవం నిర్వహించారు. సాయంత్రం విశేష తమలపాకులతో అర్చన జరిపారు. అనంతరం శ్రీగౌరీ గీతా మహిళా మండలి, కొత్రహరి నేతృత్వంలో ఏకాహం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయం అధ్యక్షుడు బొడ్డేడ సన్యాసినాయుడు, కార్యదర్శి బుద్ద రమణాజీ, కోశాధికారి కర్రి శివసూర్యనారాయణ, భక్తులు పాల్గొన్నారు.

మహిషాసురమర్దనిగా కామాక్షిదేవి

నిదానందొడ్డిలో కామాక్షమ్మ ఆలయంలో కామాక్షిదేవి అమ్మవారు భక్తులకు మహిషాసురమర్దనిగా దర్శనమిచ్చారు. గవరపాలెం పురవీధులగుండా అమ్మవారి సారెను ఊరేగించారు. శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వారి జీవిత చరిత్రను బ్రహ్మశ్రీ కొమ్మోజు సతీష్ లత దంపతులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ కోటిపల్లి శ్రీను, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి ఆలయంలో...

స్థానిక మెయిన్‌రోడ్డు కన్యకాపరమేశ్వరి దేవాలయంలో అమ్మవారు ఉదయం మహిషాసురమర్దని, సాయంత్రం నవదుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. లక్ష రూపాయి కాసులతో అమ్మవారికి అర్చన చేశారు. సాయంత్రం కూర్మనపాలెం శ్రీ కృష్ణ కళామందిర్ దివ్యసురేష్ ఆధ్వర్యంలో భారతనాట్యం ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమలో ఆలయ అధ్యక్షుడు బిళ్లపాటి కృష్ణకుమార్, కార్యదర్శి కొరుప్రోలు జగదీశ్వరరావు, కోశాధికారి శ్రీధరాల సోమరాజు, ఉత్సవకమిటీ చైర్మన్ పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కశింకోట: స్థానిక కనకమహాలక్ష్మి వీధిలో దుర్గాదేవి విగ్రహం వద్ద పెద్ద ఎత్తున అన్న సమారాధన జరిపారు. పెద్ద గుమ్మం వద్ద ఉన్న దుర్గమాంబ ఆలయంలో భవానీ భక్తులు కుంకుమ, పడి పూజలు నిర్వహించారు. సంతబయలులో భవానీ భక్తులు పడి పూజ నిర్వహించి, నృత్యాలు చేశారు. మండలంలోని వెదురుపర్తిలో ఏర్పాటు చేసిన దుర్గాదేవిని, కశింకోట వద్ద కనకదుర్గ అమ్మ వారిని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు దర్శించి పూజలు చేశారు. దుర్గాదేవి ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహించారు. దుర్గాదేవి ఆలయానికి సోమవరం గ్రామ మాజీ సర్పంచ్ రూ.50 వేలు విరాళం అందించారు. మండలంలోని చింతలపాలెం గ్రామంలో సర్పంచ్ కోట్టి రాము ఆధ్వర్యంలో అంబలం పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా లడ్డూ వేలంపాట నిర్వహించగా రూ.35 వేలకు కోన దివాకర్ సొంతం చేసుకున్నారు. నూతలగుంటపాలెంలో అన్న సమారాధన నిర్వహించారు. మాజీ సర్పంచ్‌లు గొంతిన శ్రీనివాసరావు, ఉగ్గిన రమణమూర్తి, కర్రి దుర్గినాయుడు పాల్గొన్నారు. దసరా నవరాత్రులను పురస్కరించుకుని పట్టణంలో పలు ఆలయాలతోపాటు మండపాలు ఏర్పాటు చేసిన కనకదుర్గమ్మవారిని ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ రాష్ట్ర చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, 82వవార్డు కార్పొరేటర్ మందపాటి సునీత, జానకీరామరాజు దంపతులు, వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ పరిశీలకులు దాడి రత్నాకర్‌లు దర్శించుకుని ప్రత్యేక పూజలుచేశారు. ఆయా మండపాల వద్ద ఆదివారం ఏర్పాటు చేసిన అన్నసమారాధనను వారు ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర వైద్యవిభాగం ప్రధాన కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనర్సింహారావు ఆదివారం నూకాంబిక బాలాలయంలో అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. గవరపాలెం శివశక్తిఫ్రెండ్స్‌లో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాకాళీ అమ్మవారిని దర్శించుకున్నారు.

అనకాపల్లి రూరల్: సత్యనారాయణపురం కనకదుర్గమ్మ ఆలయంలో దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో జరుగుతున్నాయి.అమ్మవారు ఆదివారం దుర్గాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి ధర్మాచార్యులు ఆధ్వర్యంలో విశేష పూజలు నిర్వహించారు. సుమారు 2 వేల మందికి అన్న ప్రసాదాన్ని అందజేసినట్టు ఆలయ కమిటీ అధ్యక్షుడు యడ్ల త్రినాథరావు తెలిపారు. ఆదివారం రాత్రి అమ్మవారి ఉత్సవ మూర్తికి ఊంజల్ సేవ జరిపారు.ఆలయ ధర్మకర్తలు బోయిన రమణాజీ,మేడిశెట్టి సత్తిబాబు ఉత్సవాలను పర్యవేక్షించారు.

కశింకోట: స్థానిక జాతీయ రహదారి పక్కన ఉన్న కనకదుర్గ ఆలయంలో అమ్మవారు 8వ అవతారంగా కవచాలంకృత దుర్గాదేవిగా ఆదివారం దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో భవానీ భక్తులు పూజలు నిర్వహించారు. విజయదశమి ఉత్సవాల సందర్భంగా సోమవారం ఆలయానికి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారని, అవసరమైన ఏర్పాట్లు పూర్తి చేశామని ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు నడిగట్ల ప్రసాద్ బాబు తెలిపారు. పడమటమ్మ లోవలో ఆదివారం దుర్గాదేవికి హోమం, ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. గురువు పి. సాంబమూర్తి ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని జరిపారు.



పడమటమ్మలోవలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు



దుర్గాదేవి ఆలయ అభివృద్ధికి రూ.50 వేల విరాళం అందజేస్తున్న మాజీ సర్పంచ్ గొంతిన శ్రీనివాసరావు



కశింకోట ఆలయంలో దుర్గాదేవి అలంకరణ



కనకదుర్గ అమ్మవారికి ఊంజల్ సేవ నిర్వహిస్తున్న అర్చకులు



కన్యకాపరమేశ్వరికి రూపాయి కాసులతో అర్చన



కామాక్షిదేవి సారె ఊరేగింపు నిర్వహిస్తున్న మహిళలు



నర్సింగరావుపేటలో అన్నసమారాధనను ప్రారంభిస్తున్న మందపాటి సునీత, జానకీరామరాజు దంపతులు

నమూనా పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు



ఎన్ఎంఎంఎస్ నమూనా పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులు

కశింకోట: జాతీయ ప్రతిభ ఉపకార వేతనం (ఎన్ఎంఎంఎస్) పరీక్షలో విద్యార్థులు విజయం సాధించాలని స్పందించే హృదయం సంస్థ ఉపాధ్యక్షుడు ఆచంట నాగేశ్వరరావు తెలిపాం స్థానిక వివేకానంద డిగ్రీ కళాశాలలో స్పందించే హృదయం సంస్థ ఆధ్వర్యంలో పది రోజులపాటు 8వ తరగతి విద్యార్థులకు ఎన్ఎంఎంఎస్ పరీక్షకు నిర్వహించిన ఉచిత శిక్షణ తరగతులు ఆదివారం ముగిశాయి. ఈ సందర్భంగా వారికి నమూనా పరీక్ష నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. సంస్థ ప్రతినిధులు ఎస్. రమేష్, ఎ.వి.ఎస్ మూర్తి తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యం



బీపీ చెక్‌చేసుకుంటున్న దంతులూరి దిలీప్‌కుమార్

అనకాపల్లిటౌన్: విద్య, వైద్య రంగాలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీరాష్ట్ర చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్ అన్నారు. మండలంలో తుమ్మపాల ఎస్‌వీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెడికల్ క్యాంప్‌ను ఆయన ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏడాదికి రెండు సార్లు రక్తపరీక్షలు చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌వీడీఎస్ వ్యవస్థాపకుడు కె. జోగినాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు సత్యనారాయణ, సురేష్ పాల్గొన్నారు.

ఎలుగుబంటి సంచారంపై అప్రమత్తం

యలమంచిలి(అనకాపల్లి రూరల్): యలమంచిలి మున్సిపాలిటీ పరిధి పెదపల్లి సమీపంలో ఎలుగుబంటి సంచరిస్తున్నందున అందరూ అప్రత్తమంగా ఉండాలని అటవీశాఖ అధికారులు మైకు ద్వారా ప్రచారం చేశారు. ఎలుబంటి సంచరించిన ప్రాంతానికి ఆదివారం అటవీశాఖ అధికారులు వెళ్లి పరిశీలించారు. మళ్లీ ఎలుగుబంటి కనిపించిందా అని అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు యలమంచిలి అటవీ పరిధి అధికారికి స్థానిక అధికారులు సమాచారం ఇచ్చారు.గతంలో ఎప్పుడూ పెదపల్లి రిజర్వ్ ఫారెస్టులో ఎలుగుబంట్ల జాడ లేదని, కానీ ఇక్కడకు ఎలుగు ఎలా వచ్చిందన్న విషయంపై అటవీ ఉన్నతాధికారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

కశింకోట: మండలంలోని విసన్నపేట వద్ద ఉన్న పడమటమ్మ లోవ ప్రాంతంలోని తోటల్లో పేకాట ఆడుతున్న ఐదుగుర్ని ఆదివారం అరెస్టు చేసినట్టు ఎస్‌ఐ ఎ.ఆదినారాయణరెడ్డి తెలిపారు. కూర్మన్నపాలెం ప్రాంతానికి చెందిన వీరి వద్ద నుంచి రూ.1050 నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక



కన్నూరుపాలెం హైస్కూలులో చదివిన పూర్వ విద్యార్థులు

కశింకోట: మండలంలోని కన్నూరుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో చదివిన 1994–95 బ్యాచ్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాలలో పూర్వ విద్యార్థులు ఒకరికొకరు పలకరించుకుని పాత జ్ఞాపకాలు నెమరు వేసుకొని ఆనందంగా ఆట పాటలతో గడిపారు. సామూహికంగా భోజనాలు చేశారు. పూర్వ విద్యార్థులు కె.చంద్రరావు, పి.ముత్యాలరావు, కె.వాసు, డి.రమణ,డి.శ్రీను, పి. అమ్మాజీ, కె.లక్ష్మణరావు పాల్గొన్నారు.